# వలపుతో ఆట కాదు

కీ॥ శే॥ పూడిపెద్ది వెంకటరమణయ్య

నేనూ కుంజరం ఓ ప్రక్కా నీ మోహన్ లలితా ఇంకో ప్రక్కా నీ ఆడవలసివచ్చిందవేళ "మాచి." ఇంక రేపు ప్రొద్దున్నే ఆడాలనగా ఈ సాయంకాలానికే ఆ పందెపుటాటల బయలు చేరుకున్నాం. కుంజరం మోటారులో వెళ్ళింది. నేను బట్నా మీద వెళ్ళేను. ఆ రాత్రి నాకు బస యిచ్చిన గుడారంలో క్యాంపుమంచంమీద పడుక్కున్నాను దళసరి రగ్గు కప్పుకొని- ఆటవిషయమే ఆలోచిస్తూ- ఓ! ఏటేటి ప్రజ ఎక్కడ నుంచినా వేల ఈ నేస్తున్నట్టు వస్తున్నారు- ఇన్ని జతల కళ్ళూ నామీదా కుంజరంమీదా చెరోటిగా పంచుకుంటాయి- అందమైన కట్టుబొట్టుతో ఓ సుందరి నాతో జయాపజయాలు లంకె వేసుకొని బరిమీద నిలబడుతుంది- మేమిద్దరమూ భాగస్వాములమవుతాం. ఇదంతా లోకం చూచి మెచ్చుకోడమో నొచ్చుకోడమో ఏదో ఒకటి చేస్తుంది- ఏంచేసినా నాకదే చాలుననిపించింది. మా యిద్దరికీ మంచి కలయిక కుదిరింది ఆటలోనని చాలామంది అంటున్నారు.

కుంజరానికి ఇరవైయేళ్ళుంటాయి మహా ఉంటేను- తెల్లతెల్లగా సళాయిలా సన్నంగా ఉంటుంది- పెద్దయింటి పిల్లేనట- డాబు దూబులూ హుందాగిరీ దర్జాలవన్నీ ఉన్నాయి- ఆమె 'లా' కాలేజీలో చదువుతూంది. మంచి బట్టలు వేస్తుంది మల్లెపువ్వులాగు ముస్తాబవుతుంది ఎప్పుడూను- బాగుంటుంది మిలమిలా మెరిసే కళ్ళూ, తళతళలాడే లోలక్కులూ బర్మా సిగ ఆమె.


ఇలాటి ఆలోచనలు రేగేయి నా హృదయంలో— రాత్రి బాగా ముదిరింది కాబోలు- గుడారపు ప్రదేశంలోంచి చలిగాలి రయిమని వచ్చి కప్పుతేలిసినా దేహాన్ని కరుస్తూంది- నిండా కప్పుకుంటే నాకు ఊపిరాడనట్టుంటుంది- దభీమని లేచి కూర్చున్నాను- అటూ యిటూ చూచేను ఎక్కడున్నాం మనం అని కొంచెం ఆలోచించేను- అదో పెద్ద బయలూ- పశువుల బీళ్ళూ- దూరంగా మామిడితోటలూ ఏవో ఉన్నాయి అవన్నీ అలా అలా చూచేను నిన్న సాయంత్రమేను- గ్రామపు రాటు తక్కువ గడ్డి మొలిచేసింది చాలాచోట్ల. అందరూ నిద్రపోతూన్న ఆ సమయంలో అలాటి బయలున గుడారంలో ఒంటిగా పడుక్కొనియున్న నాలో ఏదో వన్యత్వం రేగింది- పెద్దకొక్కులతో గండభేరుండంలా ఎగరబోయింది నా మనస్సు ఏదో స్వేచ్ఛ తలుచుకొని- ఏమిటుంది! అంతవరకూ నాకా ఊహే లేదు- కుంజరాన్ని పెళ్ళాడకూడదూ అని ఎవరో పీలగొంతుకతో నా చెవిలో చెప్పినట్టయింది- త్రుళ్ళిపడ్డాను- చలి దట్టమయింది కూర్చోడం కల్ల; దగ్గరగా ముడుచుకొని పడుక్కున్నాను— ఔను ఆమె అయినా ఎవతెనైనా పెళ్ళాడాలిగద నన్నెందుకు కూడదూ ఇష్టపడితేను అనుకున్నాను- ఒకవేళ ఆమె ఇష్టపడితే నాకిష్టమేను- ఏమీ నాకేంతక్కువ! బి. ఏ. పాసయినాను- జరూరయితే ఆమెతో కూడా సీమ వెళ్ళడానికి సిద్ధమేను- చాలకపోతే వాళ్ళ తండ్రి డబ్బున్నవాడేను సర్దుతాడు- మిస్టరు మిస్సెస్‌లుగా ఒకనాటి మంచి ప్రాతఃకాలాన బొంబాయి రేవులో నేనూ కుంజరం స్టీమరు దిగుతాం అప్పుడు స్వతంత్రంగా కుంజరం భుజాలమీదినుండి జారిపోతూన్న ఇమిటేషన్ నక్కతోలు ఆమె వక్షంమీదికి నేనే సవరిస్తాను- ఉన్నాయి! ఎన్నెన్నో లాలిత్యాలూ సొగసులూ ఉన్నాయి- చలి వెన్నులోంచీ వేసుకొస్తూంది- డిసెంబరు నెల- నా హృదయం ముడుచుకుపోయినట్టు తోచింది నాకు— ఏం నాకేం తక్కువా! అనుకొని మళ్ళా సర్దుకొని పడుకున్నాను-

ఒంటిగంట విన్నాను రెండుగంటలూ విన్నాను- తరువాత నాలుగుగంటలు విన్నాను- చలి

ముడుచుకొని లేచేను- వేగంవేగం తయారవాలి- ఆరున్నరకే ఆట ఆరంభం. ఆవేళ ఎంతో జాగ్రత్తగా టోయలెట్టయి- నీటుగా టెన్నిసు డ్రెస్సూ టెన్నిసు జోడూ వేసుకొని- టెన్నిసు రాకెట్టు సంచీతోన్నే చేత్తో పట్టుకొని గుడారం ఈవలకు వచ్చేను ఇంకా మంచు కురుస్తూంది- రెండు చేతులూ నడుం వెనకకు విరచి వానిలో రాకెట్టు తూస్తూ- కాళ్లు కాస్త ఎడంగా ఊంది నిలచి ఒయ్యారంగా ఓ ప్రక్కకు చూస్తూ నిలబడ్డాను-

ఆమె గుడారంలోంచి యీవలకు వచ్చింది ఆమె ఆమె వెనుక పది పంద్రెండేండ్ల కుర్రాడు టెన్నిసు రాకెట్టూ ఆమె చేతిపెట్టే అవీ పట్టుకొని వస్తున్నాడు- నన్ను చూచి నవ్వుముఖంతో గుడ్‌మార్నింగు అంది- నేను ప్రతిధ్వనించేను ఆమె సన్నగొంతుకను బొంగు గొంతుకతో- అప్పుడామె నాకు సరిక్రొత్తగా కనబడింది- బాగా చెరపని బొమ్మలాగుంది నా హృదయం ఇంకా రాత్రిఊహల చాళ్ళు అక్కడా అక్కడా లోతుగానే ఉన్నాయి- అప్పుడామెదగ్గర కాస్త ఎడంగా ఎదురుగా నిలబడడమో సన్నిహితంగా చనువుగా నిలబడడమో ఏమిటో ఏం బోధపడలేదు నాకు- అలాగూ ఇలాగూ కూడా గాభరాగా ఉంటున్నాను- ఆమె ఒకటి రెండు సారులు నా ముఖం క్రీగంట చూచిందికూడాను- అనుమానించే చూచిందో అలవాటుచొప్పునే చూచిందో మరి- నాకుమాత్రం కలలో నడుస్తూన్నట్టుంది ఆమె ప్రక్కను నడవడం- తృప్తిపడి ప్రస్తుతావస్థ ఏమిటి అని ఆలోచించి ఆలోచించి మళ్ళా రాత్రి మమతలో పడుతున్నాను- అది ఆమె గమనించింది కాబోలు- ఎదుటి ఆటగాడిక్కీ ఆటకత్తెకూ ఉన్న అనువులుగూర్చి చెబుతూ మన మిలాగాడాలి అలా గాడాలి అని ఆట విషయం చెబుతూందామె- సంసార విషయంలో ఇలాంటి సుళువులు కనిబెట్టి నాకెప్పుడు చెబుతుందో కుంజరం అనుకుంటున్నాను నేను.

విజయం మాదేను- మేమింత కలిసికట్టుగా ఆడుతూన్నప్పుడు విజయాన్ని కేం లోటుండదు అన్న ధైర్యం ఉంది గాని విజయకాంక్ష మాత్రం మునుపటంత పట్టుగా లేదు నాకు- ఆమె ఆత్మ హృదయంకూడా ఆటలోనే పెట్టుకుంది- ఆట ప్రారంభమయింది- ప్రారంభించడం మావంతు పడ్డాది- ఆమెవైపు బంతులు విసిరేడు బంట్రోతు- ఆమె వాని నందంగా ఒకే చేతితో అందుకుంది; ఆమె నూత్నోత్సాహంతో చేతులు రెండూ మీదకెత్తి బంతి సెర్వుచేసింది- మొదటి బంతే సరిగా పడ్డాది కాబోలు- ఆ బంతి తిరుగా వచ్చి నా రెండుపాదాల నడుమా పడి వెనుకకు దూకింది కొంచెమెత్తుగా- నేను తెల్లబోయి నిలబడ్డాను- కోర్టు మార్పుకొడకి నావైపు నడచింది ఆమె- నేను నిర్వ్యాగపడి నిలచిపోడం చూచి 'భయంలేదు' అంటూ ఏమేమో ప్రోత్సహించింది- నేనటు వెళ్ళేనుగాని నాకేమీ తోచలేదు- "మాచి" ఆడుతున్నామన్న మాటే మరచిపోయాను- ఏదో అగాధంలో పడిపోతూన్నట్టనుకున్నాను- బేటుకక్కడ పారేసి వెళ్ళిపోయి గుడారంలో పడుకుండామా అనుకున్నాను- ఆ బంతీ ఎదుటివాళ్ళే గెల్చుకున్నారు- కోర్టు మార్పుకోడంలో "ఏమీ నీ వంట్లో బాగులేదూ" అని జాలిగా నన్నడిగింది కుంజరం- నాకు చిన్న తలనొప్పి పెడుతూన్నట్టుంది- ఆమె చూపిన జాలి నన్ను స్వవిషయంలో చాలా కదలించింది. నేను జవాబు చెప్పలేదు- ఆమె చేతులతో నా తల కాస్త నిమిరితే బాగుండుననిపించింది- ఇంతలో చుట్టుప్రక్కల కూడిన ప్రజ చప్పట్లు చరచి గల్లంతుచేసేరు- నేను ఆట చైతన్యంలోకి వచ్చి



నా శ్రద్ధ చూపటానికి నాదగ్గర ఉన్న బంతులేరి చేత్తో పట్టుకున్నాను 'సెర్వు' చేయడానికి సిద్ధంగా.

మనం కాదు ఆట ప్రారంభించవలసినవాళ్ళు వాళ్ళని ఆమె నవ్వింది నా అశ్రద్ధకు విషాదం కలిపి- "క్షమర్హం క్షమర్హం" అంటూ నే నావలి ఆటమలకు బంతులు విసిరేను- ఆమెకు నామీద కోపం వచ్చిందేమోనని- పదేపదే ఆమె ముఖం చూస్తున్నాను- నన్ను నే నదిలించుకొని అద్భుతంగా అసాధ్యమనుకున్న బంతులెత్తి ఆవల వేసేను- ఎదుటిపార్టీ వాళ్ళవి ఎత్తలేక గింజుకున్నారు- సభ్యుల చప్పట్లు మిన్నుముట్టేయి- నా వేపు చూచి కిలకిలాయించింది కుంజరం రెండు సార్లూను- కాని ఆమె ముఖాన అసంతుష్టిమాత్రం తొణుకుతూంది-

"ఏం? సోకారిలాగుంది?" అన్నాను-

ఏకూళ్లో ఉన్నారంది ఆమె కోపంగా—

ఆమెమీద అపారమయిన ప్రేమతో నేను కొట్టుకుంటూ ఉంటే ఆమె నావేపు కొసరికోసలు చూడడం నాకట్టే ఇష్టంలేకపోయింది-

ఆటే శాశ్వతమా యేమిటి? అంత కినిసిపడటానికి?? జయాపజయాలు దైవాధీనాలు కావూ- ఏమి టూరికే చూపులతో పొడిచేస్తూంది- పీడా నాదా కూడా పోయే 'మాచి' పోతేను- కదిలి పోతూన్న నా హృదయాన్ని కుదుటపెట్టుకోడ మెలాగు? అని బొమముడితో ఆలోచిస్తూ ఎదుటి పార్టీవైపు చూచేను- నా అశ్రద్ధ నాశ్రయించి అంతసేపూ ఆడి గెల్చుకుంటూన్న లలిత నవ్వుముఖంతో బంతి ఎత్తి నా పాదాలదగ్గరకు విసిరి "ఎత్తు!" అన్నట్టు ఎగసిన కనుబొమలతో నన్ను హెచ్చరిస్తూ చూచింది- ఆమె చూపప్పుడెంతో లలితంగా, లాలింపుగా, చల్లగా నా హృదయాన్ని దూసింది. నేను ఆ బంతినెత్తి అంత లాలిత్యం ఆమెయెడల చూపించాలని సున్నితంగా ఆ బంతి ఆమె చేతు కందించేను- ఆమె నవ్వుతూనే ఆ బంతి కుంజరం ప్రక్కకు గుండులాగు విసిరింది- అది నేల దూసుకొని సురసురలాడి పొరలిపోయింది- నాకు ఎందుకోగాని నవ్వు వచ్చింది- నా వేపు చూచీ కుంజరంవేపు చూచీ సార్థకంగా నవ్వింది లలిత- ఆమెతో నవ్వాలనిపించి, కుంజరం వేపు చూచే, నేనూ నవ్వేను-

కుంజరం తోక మట్టిన త్రాచులాగు నన్ను కోపంతో చూపించి కందగడ్డలాగు మొగ మెర్రగా చేసికొని- నాకామె కోపం ఖాతరు లేక పోయింది.

పోతేపోతుంది 'మాచి' హృదయంలోతు గుర్తించలేనిదయింది కుంజరం- ఇంకా ఎదురుగా ఆడుతూన్న లలితే నయమేమో ఆమె మాత్రం ఆడుతూంది కాదూ? ఇలాగే నాగస్తూందా తన భాగ్యస్వామిని- అందాకా ఎందుకు- ఆటలో ఎదుటి పార్టీలో ఉన్న నన్నెంత ప్రేమ దిమ్మరించే చూపులతో చూస్తూంది! అది గాలదూ నాలాటి కవలిన హృదయంగలవాడికీ నయమింకా ఇలాటి కోపంతో ఉన్నదాన్ని శాశ్వతంగా మెడకుకట్టుకోవాలనుకున్నాను అని అనుకుంటూ నేనటూయిటూ కోర్టు మార్చుకోవడమేగాని కొట్టడం మానేశాను ఎంత సులభమైన బంతి వచ్చినాను— ఇది చూచి కుంజరం అగ్గిపింజయిపోతూంది- తానుకూడా తపాతపా తప్పుదార్లను కొట్టేసింది బంతి- విజయం మా ఎదుటిపార్టీకి వచ్చింది- లలిత నెట్టుమీదనుండి సన్నని తెల్లని వేళ్ళ చేయి నా కందించింది- బంగారంమీది పాదరసంలాగు ఆమె ముఖంలో పొదుపుకొనిపోయాయి నా చూపులు- లలిత నందరూ అభినందిస్తున్నారు- మోహన్‌కి లేదంత ఆర్భాటం- నా కారణాన్న తా నాటకత్తె అయిందన్న విశ్వాసమో, ప్రేమో ఏదో గాని నాకు చెందిన హృదయాన్ని వెలిబుచ్చే మంచి చూపు లామె వెడలించింది-

ఏదీ నిశ్చయం లేదుగాని ఎప్పటికయినా లలిత విశ్వాసంగల భార్య అవుతుందనుకున్నాను-

ఈ సందటిలో నేను మంచి ఆటగాణ్ణని పొందిన పేరు కాస్త చెదరిపోయి ఉంటుందన్న అనుమానం నాకు వచ్చింది- వెనుదిరిగి చూచేను కుంజరంకోసం- ఆమె అప్పుడే తన గుడారద్వార సమీపానికి వెళ్ళింది. ఎదుటికి చూచేను లలిత, ఆడు మగా, చుట్టూ గుమిగూడిన జనసమూహాని కందర కన్నులతో జవాబు చెప్తూంది- నాకు కాస్త దూరంగా వెళ్ళి- ఆమె నవ్వుముఖం నాకెంతో నచ్చింది- ఆమె అలా వారితో మాటాడుతూ మాటాడుతూ నావంక మధురంగా నాలుగయిదుసార్లేనా చూచింది- నేనలా నిలబడ్డాను ఇంతలో బంట్రోతు వచ్చి నెట్టు విప్పుతూ నా సమీపానికి వచ్చి "బాబూ! కోపంపడకండీ! ఏమిచ్చేరు? వాళ్ళందరూ మీకో హాస్తం ముట్టిందనుకుంటున్నార"న్నాడు- నాకు నడుం విరిగినట్టయింది-